ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 25-03-2026 సమయం : సాయంకాలం 6గం.10ని.లు

ముఖ్యాంశాలు

- రాష్ట్రంలో ఎకో, టెంపుల్ టూరిజానికి ప్రాధాన్యత ఇచ్చేలా ప్రాజెక్టులు చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.

- రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు.

- పట్టణ గృహ వినియోగదారులను ఎల్పీజీ నుంచి పిఎన్జీ గ్యాస్ సరఫరా వైపు మళ్ళించేందుకు నూతన పాలసీని తీసుకురాబోతున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.

- ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈరోజు ప్రారంభమయ్యాయి.

- ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 132వ సంచిక ఈ ఆదివారం ప్రసారమవుతుంది.

====================

రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డులో అమోదం తెలిపిన ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో పర్యాటక శాఖపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, 2029 నాటికి 50 వేల హోటల్ గదుల నిర్మాణ లక్ష్యాన్ని చేరుకోవాలని తెలిపారు. పర్యాటకులకు 10 వేల హోం స్టేలను కూడా అందుబాటులోకి తెచ్చేలా చూడాలని స్పష్టం చేశారు. విశాఖ, తిరుపతిలో అమ్యూజ్మెంట్ పార్కుల ఏర్పాటుకు యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో కేరవాన్ల రిజిస్ట్రేషన్లు, కేరవాన్ పార్కుల ఏర్పాటు అంశంపై కూడా సూచనలు చేశారు. అటవీ, దేవాదాయశాఖల సమన్వయంతో ఎకో, టెంపుల్ టూరిజానికి ప్రోత్సాహం ఇచ్చేలా ప్రాజెక్టులు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

====================

రాష్ట్రంలో ఆలయాల పవిత్రతను సంరక్షించేందుకు కృషి చేస్తున్నామని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. 3 కోట్ల 40 లక్షల రూపాయల గ్రామీణ ఉపాధిహామీ నిధులతో విజయనగరం జిల్లా రామతీర్థం నీలాచలం చుట్టూ గిరి ప్రదక్షిణ కోసం 3.7 కిలోమీటర్ల మేర కొత్తగా నిర్మించిన గిరివలయం బి.టి రహదారిని పవన్ కళ్యాణ్ ఈరోజు అమరావతి నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రంలో చాలా ఆలయాల పునర్జీవనానికి కృషి చేస్తున్నామని అన్నారు. సుమారు 40కోట్ల రూపాయల పంచాయితీరాజ్, సాస్కి నిధులతో 22 ప్రధాన ఆలయాల వద్ద అభివృద్ధి పనులను మంజూరు చేశామన్నారు.

====================

పట్టణాల్లో ఎల్పీజీ సిలిండర్ల నుంచి పైప్డ్ నేచురల్ గ్యాస్ సిలిండర్ల వైపు వినియోగదారులను మళ్లించేలా కొత్త పాలసీని తీసుకొస్తున్నట్లు రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఈరోజు అమరావతిలో పాత్రికేయులతో మాట్లాడుతూ, ఈ విషయంపై కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. వన్ టైమ్ పాస్‌వర్డ్ ద్వారానే

గ్యాస్ సరఫరా జరగాలని, సిలిండర్లు బ్లాక్ మార్కెటింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు వార్తలు నమ్మవద్దని ప్రజలకు సూచించారు. పైప్డ్ గ్యాస్ కనెక్టివిటీ వాణిజ్య అవసరాలకు ఇచ్చే గ్యాస్ సరఫరాను కేంద్రం 10 నుంచి 20 శాతం పెంచిందని మంత్రి వెల్లడించారు. రెస్టారెంట్లు, విద్యాసంస్థలకు సరఫరా పెంచేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పట్టణాల్లోని ప్రజలు పైప్డ్ గ్యాస్ కోసం నమోదు చేసుకోవచ్చని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్…28 సెకన్లు)

====================

కడప జిల్లా ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు పవిత్రమైన హరిద్ర ఘటనంతో ఈరోజు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమం బ్రహ్మోత్సవాలు, శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాలకు శ్రీకారం చుట్టే తొలి ఆచారంగా నిర్వహించామని ఆలయ వర్గాలు పేర్కొన్నాయి. ఈ సందర్భంగా మహిళా భక్తులు, శ్రీవారి సేవకులు, టీటీడీ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని పసుపు కొమ్ములను దంచే పవిత్ర కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. హరిద్ర ఘటనంలో సిద్ధం చేసిన తాజా పసుపును స్వామివారికి నిర్వహించే స్నపన తిరుమంజనం కార్యక్రమంలోనూ, శ్రీ సీతారాముల కల్యాణోత్సవానికి తలంబ్రాలలోనూ వినియోగిస్తారని ఆలయ సిబ్బంది తెలిపారు. ముందుగా పసుపు కొమ్ములు ఇతర పరికరాలను గర్భాలయంలో ప్రతిష్టించి పూజలు నిర్వహించారు. అనంతరం మహాలక్ష్మి ఆరాధన చేసి, శ్రీ సూక్తం పఠనానంతరం హరిద్ర ఘటనం నిర్వహించారని ఆలయ వర్గాలు వెల్లడించాయి.

====================

విరామం

====================

వందేళ్ల వైభవానికి ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రత్యేక నిదర్శనమని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ కొనియాడారు. శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఏయూ కన్వెన్షన్ సెంటర్లో ఈరోజు నిర్వహించిన 91, 92వ స్నాతకోత్సవాల్లో గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విజ్ఞానం, విలువలు, సేవా దృక్పథం కలిగిన పౌరులను తీర్చిదిద్దడంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం కీలక పాత్ర పోషించిందన్నారు.

====================

రాజధాని అమరావతిలో రాష్ట్ర స్థాయి అధికారులంతా ఒకేచోట ఉండేలా సెక్రటేరియట్‌కు ఐకానిక్ టవర్లు డిజైన్ చేశామని మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పి. నారాయణ వెల్లడించారు. రాజధానిలో నిర్మిస్తున్న హెచ్‌ఓడీ టవర్ -3 కార్నర్ నోడ్ అమర్చే పనులను మంత్రి నారాయణ ఈరోజు ప్రారంభించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, ఐదు టవర్ల నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. అమరావతి నిర్మాణానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక ఫైనాన్స్ మోడల్ ఇచ్చారని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్…26 సెకన్లు)

====================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 132వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 27వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

====================

గిరిజనుల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ సొళ్ల బొజ్జిరెడ్డి తెలిపారు. ఈరోజు పార్వతీపురం మన్యం జిల్లాలో గిరిజనులు, పలువురు గిరిజన సంఘాల నేతలు, ప్రతినిధులు నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. శ్రీకాకుళంలో ఉన్న గిరిజన భవనాన్ని గిరిజన సంఘాలకు అప్పగించేలా చర్యలు తీసుకుంటామని, అదే విధంగా సీతంపేటలో మరో గిరిజన భవన్ ఏర్పాటు చేయడానికి చర్యలు చేపడతామని వెల్లడించారు.

====================

దక్షిణ అంతర్గత కర్ణాటక, పరిసర ప్రాంతాలపై వున్న ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణ విభాగం తెలిపింది. ఆంధ్రప్రదేశ్, యానాంపై దిగువ ట్రోపో ఆవరణములో ఆగ్నేయ నైరుతి దిశగా గాలులు వీస్తున్నాయని, దీని ప్రభావంతో ఉత్తర కోస్తాంధ్రలో రానున్న మూడు రోజుల్లో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారిణి జి. లక్ష్మి తెలియజేస్తూ...

(వాయిస్…25 సెకన్లు)

=====================

యువత డ్రగ్స్ బారిన పడకుండా చర్యలు చేపట్టాలని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. మాదకద్రవ్యాలు, గంజాయిపై నియంత్రణ చర్యలు-అవగాహన కార్యక్రమాలపై కలెక్టరేట్ లో ఎస్పీ తుషార్ డూడితో కలిసి కలెక్టర్ ఈరోజు జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... క్లస్టర్ స్థాయిలో ఆర్డీవోలు, డీఎస్పీల ఆధ్వర్యంలో జడ్పీ హైస్కూల్ నందు మాదక ద్రవ్యరహితంపై విస్తృత అవగాహన కలిగేలా కార్యక్రమాలను చేపట్టాలన్నారు. యువతను డ్రగ్స్ కు బానిస కాకుండా అప్రమత్తం చేయాలని సూచించారు.

=====================

పశ్చిమగోదావరి జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో జిల్లాలోని ప్రజలు వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు.

=====================

=====================